నమస్తే తెలంగాణ
# మెదక్
13 హైదరాబాద్, శనివారం 3 ఫిబ్రవరి 2024 MEDAK



నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## త్రిపుర గవర్నర్ కావడం సంతోషకరం

**గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి**



మీడియాతో మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 2 : త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా తనను నియమించడం సంతోషకరంగా ఉందని ఆ రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలో ఓ కార్యక్రమానికి వెళ్తూ సిద్దిపేట పట్టణంలోని బీజేపీ నాయకుడు వంగ రాంచంద్రారెడ్డిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. త్రిపుర చిన్న రాష్ట్రం అయినప్పటికీ అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. త్రిపురలో 35 శాతం గిరిజనులు ఉన్నారని, త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తల నగరం ఎడ్యుకేషన్, మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందిందన్నారు. త్రిపుర రాష్ట్రానికి తన మిత్రులు రావాల్సిందిగా కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

## గురుకులంలో సమస్యలు పరిష్కరించాలి

**అవసరమైతే సీఎస్ఆర్ నిధులు సమకూర్చుకోవాలి**
**బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
**అల్లాపూర్ గురుకుల పాఠశాల తనిఖీ**

తూప్రాన్, ఫిబ్రవరి 2: గురుకుల పాఠశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి అల్లాపూర్ టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు ఉండగా, అవి పనిచేయకపోవడంతో మరమ్మతుల కోసం రూ. 50 వేల నగదును అందజేశారు. 750 బెడ్లు, పాఠశాల ప్రహరీ, లైబ్రరీ, ఓపెన్ జిమ్ సౌకర్యాలను కల్పించాలని, అవసరమైతే సీఎస్ఆర్ నిధులను సమకూర్చుకోవాలని ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. విద్యార్థులు ఆరుబయట చదువుకోవడాన్ని గమనించి అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గురుకులంలో సమస్యలను ఫోన్ ద్వారా కలెక్టర్ రాజర్షి షా దృష్టికి తీసుకువెళ్లారు. కొద్ది రోజుల తర్వాత ఆకస్మిక తనిఖీ చేస్తానని, అప్పటిలోగా పాఠశాల రూపురేఖలు మారాలని అన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్రా రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అరుంధతి, మున్సిపల్ కమిషనర్ ఖాజామొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




తూప్రాన్ మున్సిపల్ పరిధి అల్లాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## అసమానతలు తొలిగించేందుకే రిజర్వేషన్లు

**అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి**
**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**
**మద్దూరు మండలం మర్మాములలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ**

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 2: సమాజంలో అసమానతలు తొలిగించేందుకు రిజర్వేషన్లు ఉపయోగపడతాయని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మద్దూరు మండలం మర్మాములలో శుక్రవారం వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, మాజీ సర్పంచ్ సుందరగిరి శ్రవంతీపరశురాములుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నూతనంగా నిర్మించిన సచివాలయానికి కేసీఆర్ అంబేద్కర్ పేరు పెట్టారని గుర్తుచేశారు. దళితుల అభ్యున్నతి కోసం కేసీఆర్ దళితబంధు అమలు చేశారని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఘట్‌కేసర్‌లోని నీలిమా దవాఖానలో నియోజకవర్గంలోని పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, మాజీ సర్పంచ్‌లు చొప్పరి వరలక్ష్మీసాగర్, బొల్లు కృష్ణవేణీచంద్రమౌళి, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ జిలానీ, మాలమహానాడు సంఘం మండల అధ్యక్షుడు బొప్పె నాగయ్య, నాయకులు దామెర మల్లేశం, మంద సుమన్, గడిపె అనిల్‌కుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మద్దూరు మండలం మర్మాములలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# పింఛన్.. బాంచెన్...!



**బ్యాంకుల చుట్టూ పండుటాకుల ప్రదక్షిణలు**
**కొన్నిచోట్ల డిసెంబర్ పింఛన్లు విడుదల**
**మరికొన్ని చోట్ల డిసెంబర్, జనవరి నెలల పింఛన్లు రాలే..**
**ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,69,575 పింఛన్‌దారులు**
**కేసీఆర్ ఏ నెలకు ఆ నెల పింఛన్ అందించిండు..**
**కాంగ్రెస్ ప్రభుత్వంలో తిప్పలు పడుతున్నామంటున్న లబ్ధిదారులు**

### ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూపులు

ఆసరా పింఛన్ కోసం పండుటాకులు ఎదురుచూపులు తప్పడం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ నెల పింఛన్ ఆ నెల ఠక్కున వచ్చేది. ప్రతినెలా మొదటి వారంలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో పింఛన్ జమయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత డిసెంబర్, జనవరి నెలల పింఛన్లకు ఇంకా దిక్కులేదు. మరో వారం రోజులు గడిస్తే ఫిబ్రవరి పింఛన్లు కూడా వేయాల్సి ఉంది. జిల్లా యూనిట్‌గా పింఛన్లు విడుదల చేయడం లేదు. కొన్ని మండలాల్లో ముందుగా, మరికొన్ని మండలాల్లో ఆలస్యంగా విడుదల చేస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని తపాలా కార్యాలయాల పరిధిలో శుక్రవారం నుంచి డిసెంబర్ పింఛన్లు విడుదలయ్యాయి.దీంతో అక్కడ పింఛన్లు అందిస్తున్నారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి ఇంకా అందలేదు. దీంతో పింఛన్ డబ్బుల కోసం పండుటాకులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

సిద్దిపేట, ఫిబ్రవరి 2 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి): సమైక్య రాష్ట్రంలో కొందరికే పింఛన్లు వచ్చేవి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత, కల్లుగీత, బీడీ కార్మికులతో పాటు ఎయిడ్స్, ఫైలేరియా, డయాలసిస్ బాధితులను అక్కున చేర్చుకొని కేసీఆర్ ప్రభుత్వం పింఛన్లు ఇచ్చింది. సమైక్య రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు కేవలం రూ.200, దివ్యాంగులకు రూ.500 పింఛన్ మాత్రమే ఇచ్చాయి. కేసీఆర్ నెలనెలా దివ్యాంగులకు రూ.4016, మిగతా వర్గాలకు రూ.2016 అందించారు.

**ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,69,575 పింఛన్లు..**

సిద్దిపేట జిల్లాలో 1,91,185 మంది లబ్ధిదారులకు రూ.41,39,02,960, మెదక్ జిల్లాలో 1,16,728 మంది లబ్ధిదారులకు రూ. 25,24,39,648, సంగారెడ్డి జిల్లాలో 1,61,662 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ. 35,58,90,592 చెల్లించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాం లో ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నిరకాల పింఛన్లు కలుపుకొని మొత్తం 4,69,575 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో 1,6 4,405 మంది వృద్ధాప్య, 1,74,940 మంది వితంతువులు, 37,785 మంది దివ్యాంగులు, 4,814 మంది గీత కార్మికులు, 3,525 మంది చేనేత కార్మికులు, 3,107 మంది హెచ్ఐవీ బాధితులు, 3,448 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులు, 339 మంది డయాలసిస్ బాధితులు, 300 మంది బీడీ టేకేదారులు, 41,608 మంది బీడీ కార్మికులు, 15,304 మంది ఒంటరి మహిళలు ఉన్నారు.

**ప్రతినెలా రూ.102.22 కోట్లు..**

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆసరా పింఛన్ల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతినెలా రూ.102.22 కోట్లను లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమచేసింది. ఇందులో దివ్యాంగులు 37,785 మంది ఉన్నారు.వీరికోసం ప్రతినెలా ఒక్కొక్కరికి రూ.4,016 చొప్పున రూ.15,17, 44,560 జమ చేసింది. మిగతా వర్గాల వారు 4,31,790 మందికి మొత్తం రూ.87,04,88,640 కోట్లు చెల్లించింది. సిద్దిపేట జిల్లాలో ప్రతినెలా 1,91,185 మంది లబ్ధిదారులకు రూ.41.39 కోట్లు, వీరిలో 14,237 మంది దివ్యాంగులకు ప్రతినెలా రూ.5,71,75,792, మిగతా వర్గాలు 1,76,948 మంది లబ్ధిదారులకు రూ. 35,67,27,168 కోట్లు చెల్లించింది. మెదక్ జిల్లాలో ప్రతి నెలా 1,16,728 లబ్ధిదారులకు రూ. 25.24కోట్లు చెల్లించారు. వీరిలో దివ్యాంగులు 8,558 మంది రూ. 3,43,68,928, మిగతా వర్గాల వారు 1,08,170 మందికి రూ.21,80,70,720, సంగారెడ్డి జిల్లాలో ప్రతినెలా 1.61,662 మందికి రూ.35.58 కోట్లు , వీరిలో 14,990 మంది దివ్యాంగులకు రూ. 6,01,99,840, మిగతా వర్గాల వారు 1,46,672 మందికి రూ. 29,56,90,752 కోట్లను లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో ప్రతినెలా జమచేసింది.

**పింఛన్ కోసం ఎదురుచూపులు..**




కేసీఆర్ సారు బీడీ కార్మికులకు ఆసరా పింఛన్ మంజూరు చేసి అండగా నిలిచారు. గత బీఆర్ఎస్ సర్కారులో నెలనెలా బ్యాంకులో పింఛన్ డబ్బులు పడేది. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో పింఛన్ కోసం నెలల తరబడి వేచి చూస్తున్నాం. జనవరి నెల పింఛన్ ఇప్పటి వరకు పడలేదు. కిరాణం, ఇతర సామగ్రి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికలో కాంగ్రెస్ ఆసరా పింఛన్ రూ. 2500 ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పెంచలేదు.
**– సంగం రేఖ, బీడీ కార్మికురాలు, చీకోడు, దుబ్బాక మండలం**

**కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ ఎదురుచూపులే..**

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ ఎదురుచూపులే అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఆసరా పింఛన్ లబ్ధిదారులు, రైతులు, కొన్ని శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు ఎదురుచూపులే దిక్కవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఠంఛన్‌గా ప్రతినెలా ఆసరా పింఛన్లు వస్తుండే. సెల్‌ఫోన్‌కు మెసేజ్‌రాగానే నేరుగా బ్యాంకుకు వెళ్లి డబ్బులు తీసుకునేవారు. అప్పుడు ఎలాంటి రంది లేకుండే. ఇక రైతుల పరిస్థితి కూడా ఘోరంగా ఉంది. యాసంగి పంట సాగు ప్రారంభం కాగానే కేసీఆర్ ప్రభుత్వం డిసెంబర్ చివరి నుంచి జనవరి సంక్రాంతి పండుగ వరకు అందరికీ రైతుబంధు నేరుగా రైతుల బ్యాంకుఖాతాలో డబ్బులు జమచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుబంధు ఇంకా పూర్తిస్థాయిలో పడలేదు.

**పింఛన్లు ఇవ్వకపోవడమే చేయూతనా..**



సిద్దిపేట, ఫిబ్రవరి 2: వృద్ధులు, దివ్యాంగులు ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఫిబ్రవరి నెల కొనసాగుతున్నా నేటికీ జనవరి నెలకు సంబంధించిన పింఛను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయలేదు. లబ్ధిదారులకు పింఛన్లు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. చేయూత పథకం ద్వారా గత డిసెంబర్ నుంచి రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడేమో సమయానికి కనీసం రూ.2 వేలు కూడా ఇవ్వకపోవడం విడ్డూరం. రూ. 200 ఉన్న పింఛన్ రూ.2000 లకు పెంచి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసరా కల్పించారు. ప్రస్తుతం ఆసరా డబ్బులు ఆలస్యం కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన పదేండ్లలో పింఛన్ కోసం లబ్ధిదారులు రోడ్డెక్కి ఆందోళనలు చేసిన ఘటనలు లేవు. తక్షణమే జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన పింఛన్ డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయాలి. **– మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

## ప్రజలకు అందుబాటులో ఉంటా

**పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపునకు కృషి చేస్తా**
**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**
**ప్రత్యేక పూజలు నిర్వహించి తొలిసారి క్యాంపు కార్యాలయానికి రాక**

నర్సాపూర్, ఫిబ్రవరి 2: ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పూజలు చేసి మొదటి సారి అడుగుపెట్టారు. ఉదయం 5 గంటల ప్రాంతంలో పూర్ణాహుతి, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి క్యాంప్ కార్యాలయం వేదికగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ గతంలో క్యాంప్ కార్యాలయాలను నిర్మించారని గుర్తుచేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని, ఇంకా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్‌కేవీ జిల్లా ప్రధానకార్యదర్శి సిలువేరి వీరేశం, బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రెడ్డి, సత్యంగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సూరారం నర్సింహులు, షేక్ హుస్సేన్, సాగర్, జ్ఞానేశ్వర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## కదిలిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు

అక్కన్నపేట, ఫిబ్రవరి 2: నిషేధిత గుడుంబా తయారు, రవాణా, విక్రయాలు, బెల్లం సరఫరా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్, అక్కన్నపేట ఎస్సై వివేక్ వేర్వేరుగా హెచ్చరించారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'గుప్పుమంటున్న గుడుంబా' పేరిట కథనం ప్రచురితమైంది. దీంతో హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ పవన్, జిల్లా టాస్క్ ఫోర్స్, అక్కన్నపేట ఎస్సై వివేక్ ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా విక్రయ కేంద్రాలు, గిరిజన తండాల్లో విస్తృతంగా దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. అక్కన్నపేట ఎస్సై వివేక్ మండల కేంద్రంలో కూతాటి పోచయ్య ఇంట్లో తనిఖీ చేసి గుడుంబా ప్యాకెట్లను (సుమారు 6లీటర్లు) స్వాధీనం చేసుకుని ఆయనపై కేసు నమోదు చేశారు. మరో నలుగురు గుడుంబా విక్రయదారులను బైండోవర్ చేశారు. మరోవైపు హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ పవన్ నేతృత్వంలో ఎస్సై దామోదర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సరిత, స్థానిక పోలీసులు సంయుక్తంగా గిరిజన తండాల్లో తనిఖీలు చేశారు. గతంలో గుడుంబా కేసుల్లో ఉన్న పాత నిందితుల ఇండ్లపై దాడులు చేశారు. నాటు సారా తయారీ స్థావరాలకు వెళ్లి గుడుంబా కోసం ఉపయోగించే 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. లీటర్ సారా స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. గడిచిన రెండు నెలల్లో గుడుంబాకు సంబంధించి 13 కేసులు నమోదు చేసి ఐదుగురిని ఆరెస్ట్ చేసి 800లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని, 49 లీటర్ల నాటుసారా, నాలుగు ద్విచక్ర వాహనాలు, 60కేజీల బెల్లం, 240 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నామన్నారు. సక్రమంగా విక్రయించని బెల్లం వ్యాపారులకు నోటీసు లు జారీ చేశామని పేర్కొన్నారు. 11 మందిని బైండోవర్ చేశామని, బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి రూ. 50 వేల జరిమానా విధించామన్నారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుళ్లు రాజమల్లారెడ్డి, చెన్నగౌడ్, కానిస్టేబుళ్లు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

## దివ్యాంగులకు పెన్షన్ ఎప్పుడిస్తారు?


సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 2: దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ఇస్తున్న రూ.4వేల పెన్షన్ కంటే అదనంగా మరో రెండు వేలు కలిపి రూ.6 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఇవ్వడం లేదని ఆసంఘం నేతలు అశోక్, నర్సింహులు, లచ్చయ్య, యాదగిరి రమేశ్, పరశురాములు, రాములు ప్రశ్నించారు. సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. దివ్యాంగుల పట్ల చిన్నచూపు వద్దని, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.



సిద్దిపేటలో ఆసరా పెన్షన్లు ఇవ్వాలని దివ్యాంగుల నిరసన

## నేడో రేపో బదిలీలు

**మూడేండ్లుగా ఒకే చోట పనిచేస్తున్న అధికారుల జాబితా సిద్ధం**
**శాఖల వారీగా లిస్ట్ తయారు**
**కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రక్రియ షురూ..**



మెదక్,/ సంగారెడ్డి (నమస్తే తెలంగాణ), ఫిబ్రవరి 2: కీలకమైన ప్రభుత్వ విభాగాల్లో ఏండ్లుగా పాతుకుపోయిన అధికారులు, ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమవుతోంది. కొంతమంది సుమారు ఐదేండ్లు గా ఒకే సీటులో ఉండడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూన్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మెదక్ జిల్లాలో వివిధ శాఖల్లో మూడేండ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని స్పష్టం చేసింది. దీంతో, వరుసగా మూడేండ్ల సర్వీసు ఉన్నవారితో పాటు సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులు, గతంలో జరిగిన ఎన్నికల్లో ఆరోపణలు, ఫిర్యాదులు ఎదుర్కొన్న ఆఫీసర్లు, జూన్‌లోగా పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులు ఇలా వివిధ జాబితాలను సిద్ధం చేయడంపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

**మూడేండ్లుగా ఉన్న అధికారుల జాబితాపై కసరత్తు...**

జిల్లాలో మూడేండ్లుగా కీలక పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న అధికారుల జాబితా రూపొందించడంపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రాథమికంగా లిస్ట్‌ను సిద్ధం చేశారు. దీనిపై పరిశీలన జరిపిన అనంతరం తుది జాబితా విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు స్థానచలనం కలగనున్నది.

**కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు..**

రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అధికారుల బదిలీలు చేపట్టేందుకు ఉన్నతాధికారులు కార్యాచరణ చేపట్టారు. జూన్‌లోగా పదవీ విరమణ చేయనున్న వారిని జాబితాలోకి తీసుకోవడం లేదు. నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో అన్ని విభాగాల్లో భారీ ఎత్తున బదిలీ అయ్యాయి. మునుపటితో పోలిస్తే ప్రస్తుతం పెద్దగా బదిలీలు ఉండకపోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఎన్నికల విధుల్లో అలసత్వం వహించిన వారిపై ఎన్నికల సంఘం క్రమ శిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తే అలాంటి ఉద్యోగులకు పార్లమెంట్ ఎన్నికల విధులు అప్పగించకుండా ఉండేలా ప్రణాళికలు తయారుచేస్తున్నారు. మొదటి వారం లోగా మొత్తం బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల సంఘానికి నివేదిక ఇచ్చేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. మరోవైపు అంతర్గత బదిలీలు, డిప్యుటేషన్లపై వచ్చిన వారిని వెనక్కి పంపడానికి సైతం యోచిస్తున్నారు. తాజా పరిణామాలపై కింది స్థాయి నుంచి పైస్థాయి ఉద్యోగుల వరకు చర్చనీయాంశంగా మారింది.

**సంగారెడ్డి జిల్లాలో 60 మందికిపైగా స్థానచలనం!**

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారుల బదిలీలు జరగనున్నాయి. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ శాఖల్లో ఒకేచోట మూడేండ్లకుపైగా పనిచేస్తున్న అధికారుల బదిలీకి రంగం సిద్ధమైంది. రెవెన్యూశాఖలో తహసీల్దార్ సహా ఆ స్థాయి అధికారులు 20 మంది, పోలీస్‌శాఖలో 25 మందికి పైగా సీఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్‌శాఖలో 20 మందికిపైగా అధికారులు, 22 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫర్లకు సంబంధించిన జాబితాను జిల్లాయంత్రాంగం ఎన్నికల కమిషన్‌కు పంపినట్లు తెలిసింది.

## 'మాదకద్రవ్యాలు' కట్టడి చేయాలి

**యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి**
**సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి**
**కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం**



సంగారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి, ఫిబ్రవరి 2: సమాజానికి చీడ పురుగులా మారిన మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి సమిష్టి కృషి చేసి యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత బానిస కాకుండా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాల విద్యార్థి దశ నుంచి యువత మత్తుకు బానిసగా మారుతున్నదని మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలన్నారు. వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు.

**మాదకద్రవ్యాల నిరోధానికి కృషి**
**– ఎస్పీ చెన్నూరి రూపేశ్**

జిల్లాలో మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్‌శాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని, గంజాయి సాగు, వినియోగం, రవాణాకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని వ్యవసాయ, అటవీ తదితర శాఖల అధికారులను ఎస్పీ చెన్నూరి రూపేశ్ కోరారు. గంజాయి సాగు చేయొద్దని ఏఈవోలతో రైతులకు అవగాహన కల్పించాలని, సాగుచేసే వారిపై కేసులు నమోదు చేసి వారి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరికలు జారీ చేయాలన్నారు. జిల్లాలో జిన్నారం పరిధిలో ఆల్ప్రాజోలం తయారీ చేస్తున్న ఒక పరిశ్రమను గుర్తించి మూసి వేశామన్నారు. ఎక్సైజ్ తదితర శాఖలకు పోలీసుశాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వాణి, ఎంఎన్ఆర్ వైద్య కళాశాల ప్రతినిధులు, వ్యవసాయ, రవాణా, విద్య, ఎక్సైజ్, అటవీ తదితరశాఖల అధికారులు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, డీఎస్పీలు, ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.